విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY — R N I No. APTEL/2012/53127 — తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV — THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 112 | గురువారం 20. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## నేనూ దిమాగీ నక్సలైట్‌నే

### ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్



**ఢిల్లీ (తెలంగాణ వాణి)** ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ మిగతా 2లో..

## ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాల్లోకి తీసుకువస్తే.. పథకాలు అమలు చేయవచ్చు

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**

తెలంగాణ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో కీలక పరిణామం ఎదురైంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత సంక్షేమ పథకాలు, భూసేకరణ బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం వివాదంపై విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల అమలు, భూసేకరణ బాధితుల పిటిషన్లపై విచారణ సందర్భంగా కోర్టు స్పందిస్తూ చట్టబద్ధత లేని ఉచిత పథకాల కోసం ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేస్తే ఎలా అని ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాల్లోకి తీసుకువస్తే.. ఆ ద్వారా వచ్చే ఆదాయాన్నీ ఇలాంటి ఉచిత పథకాలకు ఖర్చు చేయవచ్చు కదా అని ధర్మాసనం ప్రభుత్వానికి సూచించింది.

## కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం.. 9 మంది మృతి



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మీర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏసీ మెషిన్ బ్లాస్ట్ కావడం వల్ల అగ్నిప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మృతులంతా బంగ్లాదేశీ దేశస్థులు అని తెలిసింది.

## ఉరిశిక్షను తప్పించలేం

### సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి:** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో మిగతా 2లో..




## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు
- '22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు చేసి మళ్లీ 22ఏ జాబితాలో పెట్టారట.
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిస్తే.. బీఆర్ఎస్‌కు పోరాటం తెలుసు. సమస్యను పరిష్కరిస్తారా..
- ఒక్క ఎకరా కూడా 22ఏ కింద పెట్టలేదని 10 రోజుల క్రితం పొంగులేటి చెప్పారు..



# తెలంగాణ ప్రగతికి బ్యాంకులే కీలకం..

- రాష్ట్ర ఆర్థిక లక్ష్యాల్లో బ్యాంకులు భాగస్వాములు కావాలి
- 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యానికి 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్'
- తెలంగాణ రైజింగ్ 2047కు అనుగుణంగా వ్యూహం
- ప్రభుత్వ వ్యయంతోనే సాధ్యం కాదు.. భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు అవసరం
- రైతు కోసం బ్యాంకు వెతకడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతు వద్దకు వెళ్లాలి
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం
- తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' కేవలం విజన్ డాక్యుమెంట్ కాదని.. తెలంగాణ ప్రజలతో ప్రభుత్వం చేసుకున్న అభివృద్ధి ఒప్పందమన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాలని బ్యాంకర్లకు సూచించారు. తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములుగా మారాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ వ్యయంతోనే ఈ లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదని, భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు. బ్యాంకులు కేవలం నిర్దేశించిన రుణ లక్ష్యాలను చేరుకోవడానికే పరిమితం కాకుండా.. తాము ఇచ్చిన రుణాలతో ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి, ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి, వ్యవసాయ



ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయాలు ఎంత మెరుగుపడ్డాయనే అంశాలను నిరంతరం సమీక్షించుకోవాలని సూచించారు. రుణాల పరిమాణం కంటే.. వాటి ద్వారా సృష్టించిన అభివృద్ధి, ఉపాధి, ఆదాయమే బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానం కావాలన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ వ్యవసాయ రంగమే పునాది. రైతులకు అవసరమైన సమయంలో రుణాలు అందేలా బ్యాంకులు ముందడుగు వేయాలన్నారు.

## అప్పుడు సీజేపి ఇప్పుడు దిమాగీ నక్సల్స్




**ఢిల్లీ (తెలంగాణ వాణి)** కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతా పార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగతా 2లో..



## బాధితుడికి రూ.కోటి రిఫండ్ చేసిన సైబరాబాద్ సీపీ

- చీరల దుకాణం అకౌంటెంట్‌కు వాట్సప్‌లో యజమాని పేరు, డీపీతో నకిలీ మెసేజ్ పంపి రూ.కోటి కాజేశారు.

సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం సీపీ రమేష్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. "సైబర్ నేరగాళ్లు.. చీరల దుకాణం అకౌంటెంట్‌కు వాట్సప్‌లో యజమాని పేరు, డీపీతో నకిలీ మెసేజ్ పంపి రూ.కోటి కాజేశారు. ఈకేసులో యూపీలోని లక్నోకు చెందిన దీపక్ కుమార్‌ను అరెస్ట్ చేశాం.

## రహదారుల అభివృద్ధితోనే పారిశ్రామిక ప్రగతి, ఉపాధి విస్తరణ

రహదారుల అభివృద్ధి ద్వారానే పరిశ్రమలు, వాణిజ్య రంగాలు విస్తరించి స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో బుధవారం రూ.219.67 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్, నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్షలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లు, పంచాయతీరాజ్ పరిధిలో రూ.17 వేల కోట్లతో యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. హెచ్‌ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులతో పనులు చేపడుతున్నామని, నేడు శంకుస్థాపన చేసిన పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్--రామగుండం గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను చేర్చేందుకు కేంద్రంతో చర్చిస్తామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కఠిన ఆర్థిక పరిస్థితుల్లోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను నిరాటంకంగా అమలు చేస్తున్నామని



తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వాడుతూ ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తరించాలని సూచించారు.

## పరకాల ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తా..

మంత్రి కొండా సురేఖ కూతురు కొండ సుష్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్, అతడి సోదరులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాను చేసే వ్యాఖ్యలపై స్పందిస్తే మీ జాతకం బయట పెడుతానని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి తానే పోటీ చేసి గెలుపొందుతానని ధీమాను వ్యక్తం చేశారు. బుధవారం మంత్రి కొండ సురేఖ జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా గీసుకొండలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని,రేవూరి ప్రకాశ్ రెడ్డి కాని, మీ తాత కానీ వచ్చి ఇక్కడ పోటీ చేయండని రేవంత్ కు సవాల్ విసిరారు. అనవసరంగా తనను రెచ్చగొట్టవద్దని హెచ్చరించారు. పరకాల ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేయించు. తాను అక్కడ పోటీ చేసి గెలుపొందుతానని అన్నారు.



## గచ్చిబౌలి పీఎస్ పరిధిలో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

- ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి
- నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం
- "ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం.
- విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది.
- వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.
- ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం.




## ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ

- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం



## బుగ్గారం నూతన ఎంఈఓ మోహన్ రెడ్డికి ఘన సన్మానం



**జగిత్యాల/బుగ్గారం, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
బుగ్గారం మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన మోహన్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా వ్యవస్థ బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాదాద్రి గిరిప్రదక్షిణలో పాల్గొన్న బీర్ల అయిలయ్య



**రాజపేట, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని యాదాద్రిలో నిర్వహించిన గిరిప్రదక్షిణలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఆలయ ఈఓ భవానీ శంకర్‌తో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొనగా, ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

## గర్భిణులు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంకురం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు గర్భిణుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందేలా చూడాలన్నారు. ఎన్‌ఎంఆర్ (నవజాత శిశు మరణాల రేటు)ను సింగిల్ డిజిట్‌కు తగ్గించడమే 'అంకురం' కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. అలాగే 'సంకల్ప్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి నవజాత శిశు మరణాలను గత ఏడాదితో పోలిస్తే 50 శాతం తగ్గించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ రాజేందర్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, వైద్యులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభిజిత్ దిప్కేతో భేటీ అయిన తుషార్ గాంధీ



**ఔరంగాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కేతో మహాత్మా గాంధీ మనవడు తుషార్ అరుణ్ గాంధీ బుధవారం భేటీ అయ్యారు. దిప్కే నివాసంలో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో పలు సామాజిక, రాజకీయ అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జెన్-జీ విద్యార్థి ఉద్యమం యువతలో చైతన్యం, స్ఫూర్తి నింపిందని తుషార్ గాంధీ పేర్కొన్నారు. శాంతియుతంగా నిర్వహించిన ఆ ఉద్యమం తనను కూడా ప్రభావితం చేసిందని తెలిపారు. యువత ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. సమావేశంలో మహారాష్ట్ర నాయకులు ఇందర్‌జీత్ మోహితే, మయూర్ షిర్కే, మొయిజ్ బాద్‌షా, ముస్లిం మేధావుల ఫోరం నాయకుడు ఫిరోజ్ మిఠి బోర్వాల, ఔరంగాబాద్‌కు చెందిన కామ్రేడ్ అమోల్ సరోదే తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి చిన్నారెడ్డికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసులు

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి వార్తల్లోకి ఎక్కాయి. పార్టీ టికెట్ అంశంపై ఉన్న అసంతృప్తితో ఒకరిపై మరొకరు అనుచిత వ్యాఖ్యలు చేసుకుంటున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ కూతురు సీఎం రేవంత్ రెడ్డి పై సంచలన వ్యాఖ్యలు చేసింది. దీంతో అప్రమత్తం అయిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలను లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత (ఖశీఅఋ ాబంష్ట్రఎఋ) బహిరంగంగా చేసిన తీవ్ర విమర్శలు, సంచలన వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు క్రమశిక్షణ కమిటీ అధికారికంగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలపై మూడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ప్రభుత్వ పెద్దలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు, వనపర్తి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో స్థానిక ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో సీనియర్ నేత, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి సైతం క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. వనపర్తి ఎమ్మెల్యే తీరుపై బహిరంగంగా చేసిన విమర్శలకు సంబంధించి మూడు రోజుల్లో తన వివరణను సమర్పించాలని స్పష్టం చేసింది. పార్టీ లైన్ దాటి సొంత పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నేతలను బహిరంగ వేదికలపై విమర్శిస్తే సహించేది లేదని కమిటీ హెచ్చరించింది. ఇద్దరు సీనియర్ నేతలకు నోటీసులు జారీ కావడంతో రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర రాజకీయ చర్చ మొదలైంది.

## ప్రజలలో నమ్మకం పెంచేలా పోలీసు విధులు నిర్వర్తించాలి: ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ**



**ఆదిలాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజల్లో పోలీసులపై నమ్మకం, గౌరవం పెరిగేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ సిబ్బందికి సూచించారు. బుధవారం సిరికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వాహనాల స్థితిగతులు, సిబ్బంది విధుల పట్టిక, వివిధ రికార్డులను ఎస్పీ పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, గుడుంబా, మాదకద్రవ్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని, ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ అధికారిని కేటాయించి సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. కేసుల్లో ఎలాంటి పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ఓపెన్ డ్రింకింగ్‌ను అరికట్టాలని సూచించారు. చిన్న నేరాలను ప్రారంభ దశలోనే నియంత్రించాలని, కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, ఎస్ఐ బి. విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**మ్యాపింగ్ కాని, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్లపై ప్రత్యేక దృష్టి: సీఈఓ సుదర్శన్ రెడ్డి**



**కరీంనగర్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని ఆయన సమీక్షించారు. కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్ల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ఫారాల పంపిణీ, సేకరణ అనంతరం సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత తేదీలో పౌరసత్వాన్ని నిర్ధారించే ధ్రువపత్రాలతో హాజరయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించాలని, అక్టోబర్ 15లోగా నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ప్రతి దశను సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో 61,886 మంది ఓటర్లు మ్యాపింగ్ కాలేదని, 2,08,308 మంది ఓటర్లు అనామలీస్ కింద ఉన్నారని తెలిపారు. వీరందరికీ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## శాతవాహనలో ఆరు నూతన రెగ్యులర్ పీజీ కోర్సులు

**శాతవాహన అభివృద్ధిలో మరో ముందడుగు: ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్**

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
శాతవాహన విశ్వవిద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరం నుంచి ఆరు నూతన పీజీ కోర్సులను రెగ్యులర్ విధానంలో ప్రారంభించేం దుకు అనుమతి లభించింది. ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ ప్రత్యేక చొరవతో పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన ఈ కోర్సులకు అనుమతులు మంజూరు చేశారు. నూతన కోర్సుల్లో ఎంబీఏ (రిటైల్ మేనేజ్‌మెంట్), ఎంకామ్ (ఫైనాన్స్ టెక్నాలజీ), ఎంఎస్సీ (ఫోరెన్సిక్ సైన్స్), ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్, ఎంఎస్‌డబ్ల్యూ (మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్), ఎంబీఏ (బిజినెస్ అనలిటిక్స్) ఉన్నాయి. కరీంనగర్‌లోని కామర్స్ కళాశాలలో రెండు, సైన్స్ కళాశాలలో రెండు, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాలలో ఒకటి, గోదావరిఖని పీజీ కళాశాలలో ఒక కోర్సు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వీసీ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న కోర్సులను రెగ్యులర్ విధానంలో అందించడం ద్వారా స్థానిక, గ్రామీణ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశ్వవిద్యాలయంలో మరిన్ని నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా వైశ్య భవన్ పునర్నిర్మాణ భూమిపూజ

**హాజరైన కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**కరీంనగర్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్‌లో ఉన్న వైశ్య భవన్‌ను ఆధునిక సౌకర్యాలతో నూతన కన్వెన్షన్ హాల్‌గా పునర్నిర్మించేందుకు భూమిపూజ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైశ్య భవన్ ప్రాంగణానికి చేరుకున్న అతిథులకు వైశ్యసేవ కేంద్రం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ నూతన భవనం ఆర్యవైశ్యుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రజలందరికీ ఉపయోగపడేలా ఆధునిక వసతులతో నిర్మించడం అభినందనీయమన్నారు. నిర్మాణ పనులకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ార్యక్రమంలో వైశ్యసేవ కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి రమేష్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారత వర్సెస్ ఫెడరల్ సమతుల్యత

ఒక దేశ అభివృద్ధి ఆ దేశంలో మహిళలు సాధించిన ప్రగతిని బట్టే కొలవబడుతుంది.భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభల రూపకల్పన,దేశ భవిష్యత్తును నిర్ణయించే చట్టాల తయారీలో మహిళల భాగస్వామ్యం ఎంత? అనే ప్రశ్నకు దశాబ్దాలుగా వినిపిస్తున్న సమాధానం చాలా తక్కువ.ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ చట్టం) గతేడాది ఆమోదం పొందినా, క్షేత్ర స్థాయిలో దాని అమలు మాత్రం ఇంకా సవాలుగానే మిగిలి పోయింది. ముఖ్యంగా,గత ఏప్రిల్ ప్రత్యేక సమావేశాలలో నియోజ కవర్గాల పునర్విభజన (**Delimitation**) అంశంతో ముడిపడి ఉన్న ప్యాకేజీ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దేశ రాజకీయాన్ని ఒక్కసారిగా కుదిపేసింది.ఈ నేపథ్యంలో, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ఈ మహిళా బిల్లు భవితవ్యం ఏ కానుంది? కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి వ్యూహంతో ముందుకు రాబోతోంది?

మహిళా సాధికారతను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టాలన్న ప్రభుత్వ పట్టుదల,దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆందోళనల మధ్య ఈసారి పార్లమెంట్‌లో ఎలాంటి రాజకీయ వ్యూహాలు నడవనున్నాయి? మహిళా బిల్లు ఒంటరిగానే చట్టరూపం దాల్చగలదా? ఈ వర్షాకాల సమావేశాలు నారీ శక్తికి కొత్త దిశను చూపిస్తాయా?

**మహిళా రిజర్వేషన్ బిల్లు అంటే ఏమిటి?**

లోక్‌సభ మరియు దేశంలోని అన్ని రాష్ట్రాల విధానసభలలో (అసెంబ్లీలలో) మహిళలకు 33 శాతం (మూడో వంతు) స్థానాలను కేటాయించే చట్టమే మహిళా రిజర్వేషన్ బిల్లు.దీనికి అధికారికంగా 'నారీ శక్తి వందన్ అధినియం' (106వ రాజ్యాంగ సవరణ చట్టం) అని పేరు పెట్టారు.ఈ బిల్లు 2023 లోనే పార్లమెంట్‌లో ఆమోదం పొంది చట్టంగా మారింది. అయితే, ఈ చట్టంలో ప్రభుత్వం ఒక నిబంధన పెట్టింది:కొత్త జనాభా గణన (జవఅంబం) మరియు నియోజకవర్గాల పునర్విభజన (**Delimitation**) పూర్తయిన తర్వాతే ఈ 33% రిజర్వేషన్ అమలులోకి వస్తుంది అని.

మొట్టమొదటిసారిగా ఈ బిల్లును 1996లో ప్రవేశపెట్టారు.ఆ తర్వాత దాదాపు 27 ఏళ్ల పాటు ఇది నలిగింది.?అంతర్గత కోటా వివాదాలు,ఓబీసీ (ాదీజ) మరియు మైనారిటీ మహిళలకు కూడా ఇందులో ప్రత్యేక సబ్-కోటా ఇవ్వాలని కొన్ని రాజకీయ పార్టీలు పట్టుబట్టడం వల్ల ఏకాభిప్రాయం కుదరలేదు.

మహిళలకు కేటాయించిన 33% రాజకీయ రిజర్వేషన్లలో,వెనుకబడిన తరగతులకు (దీజ) ఉప-కోటాలు (**Sub-quotas**) వర్తింపజేయకపోతే.. సామాజికంగా,ఆర్థికంగా బలపడిన వర్గాలే (**Creamy Layer / Upper Castes**) ఆ అవకాశాలను చేజిక్కించుకునే ప్రమాదం ఉంది.బీసీల్లోని నిరుపేద, అత్యంత వెనుకబడిన వర్గాలకు అసెంబ్లీ మరియు పార్లమెంట్లలో తగిన ప్రాతినిధ్యం లభించదు. ఫలితంగా,రిజర్వేషన్ల అసలు ఉద్దేశమైన 'సమాన రాజకీయ ప్రాతినిధ్యం' దెబ్బతిని,అధికారమంతా మళ్లీ ఉన్నత,ధనిక వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమవుతుంది. మహిళా రిజర్వేషన్లు అనేవి సాధికారతకు సంకేతంగా కనిపించినప్పటికీ, ఆచరణలో వర్గీకరణ (**Sub-quotas**) లేకపోతే అవి ఉన్నత వర్గాల రాజకీయాలకు (**Dynasty Politics**) కొత్త రూపంగా మారే ప్రమాదం ఉంది. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి తన సహచర శాసన సభ్యుడి తో ఓ కార్యక్రమం లో పాలుపంచుకున్న సందర్భంగా శాసన సభ స్థానాల పునర్వ్యవస్థీకరణ లో భాగం గా మహిళల కు అదనపు స్థానాలు ఏర్పడబోతున్నాయని ఆ స్థానాల లో పోటీకి సిద్ధపడండంటూ తన సహచర శాసన సభ సభ్యుని భార్య ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం.

**ప్రస్తుతం**

రాజకీయ సంకల్పం లోపించడం,ప్రాంతీయ పార్టీల అభ్యంతరాలు, సీట్లు కోల్పోతామనే కొందరు పురుష నేతల ఆందోళనల వల్ల గతంలో ఇది చట్టం కాలేకపోయింది.

**మహిళా రిజర్వేషన్ బిల్లు ఎందుకు వీగి పోయింది?**

భారత పార్లమెంట్ చరిత్రలోనే మొదటిసారిగా, మోదీ ప్రభుత్వ హయాంలో ఒక రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం ఇదే తొలిసారి.2026 ఏప్రిల్ 16 నుండి 18 వరకు జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో,మహిళా రిజర్వేషన్‌ను వేగంగా అమలు చేయడానికి ప్రభుత్వం 131వ రాజ్యాంగ సవరణ బిల్లు,2026 ను ప్రవేశపెట్టింది.అయితే, ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లు ఆమోదం పొందలేకపోయింది. రాజ్యాంగ సవరణ బిల్లు (**Article** 368 ప్రకారం) చట్టం కావాలంటే సభలో ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులలో కనీసం మూడింట రెండొంతుల 2/3తీ౨ మంది మద్దతు తప్పనిసరిగా ఉండాలి.మెజారిటీకి అంటే కనీసం 352 ఓట్లు 54 ఓట్లు తక్కువయ్యాయి దీనివల్ల బిల్లు సాంకేతికంగా వీగిపోయింది.

**'డిలిమిటేషన్' (నియోజకవర్గాల పునర్విభజన)తో ముడిపెట్టడం**

ఈ బిల్లు వీగిపోవడానికి ప్రధాన రాజకీయ కారణం ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌ను నియోజకవర్గాల పునర్విభజన (**Delimitation**) మరియు లోక్‌సభ స్థానాల పెంపుతో ముడిపెట్టడం.

ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 550 నుండి 850కి పెంచాలని,ఆ పెరిగిన స్థానాల్లో 33% మహిళలకు ఇవ్వాలని ప్రతిపాదించింది.

కానీ ప్రతిపక్షాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే (543 సీట్లలోనే) తక్షణమే 33% మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి, అంతేకానీ డిలిమిటేషన్ వరకు దీన్ని ఆపకూడదు అని విపక్షాలు పట్టుబట్టాయి.

**దక్షిణాది రాష్ట్రాల తీవ్ర అభ్యంతరాలు**

జనాభా ప్రాతిపదికన 2011 సెన్సస్ ఆధారంగా కొత్త డిలిమిటేషన్ చేపడితే, జనాభాను విజయవంతంగా నియంత్రించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు తమ లోక్‌సభ సీట్లను కోల్పోయే ప్రమాదం ఉంది.అదే సమయంలో జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయి.ఈ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుందనే భయంతో దక్షిణాది ప్రాంతీయ పార్టీలు (ఐవీఖ, వైఎస్సార్సీపీ, బీఆర్ఎస్ వంటివి) మరియు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (౧వీజ) ఒకతాటిపైకి వచ్చి బిల్లును అడ్డుకున్నాయి.

**వర్షాకాల సమావేశా లలో మహిళా బిల్లు పరిస్థితి ఎలా ఉండ బోతోంది?**

ప్రభుత్వ పట్టుదల: ఎన్డీఏ (చీణూ) కూటమికి లోక్‌సభలో అవసరమైన బలం పెరుగుతోందని, ఈసారి ప్రతిపక్షాల వ్యూహాలను తిప్పికొట్టి బిల్లును ఎలాగైనా ఆమోదింపజేస్తామని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ప్రతిపక్షాల ఐక్యత కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ (౧వీజ) వంటి పార్టీలు ఇప్పటికీ తమ పాత డిమాండ్లపైనే (ఓబీసీ సబ్-కోటా మరియు తక్షణ అమలు) పట్టుబట్టే అవకాశం ఉంది.అయితే, ప్రతిపక్ష కూటమిలోని కొన్ని పార్టీలలో అంతర్గత విభేదాలు రావడం ప్రభుత్వానికి కలిసిరావచ్చు.

**మహిళా బిల్లు ఒంటరిగానే ఆమోదం పొందుతుందా?**

రాజకీయ విశ్లేషకుల ప్రకారం మహిళా బిల్లు ఒంటరిగా (**Alone**) ఆమోదం పొందే అవకాశాలు చాలా తక్కువ. ప్రభుత్వం దీనిని ఖచ్చితంగా డిలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లుతో కలిపే ముందుకు తీసుకెళ్లే వ్యూహంలో ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం (550 నుండి 850 సీట్లకు) అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల,మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు డిలిమిటేషన్ బిల్లు రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న జంట బిల్లులుగానే పార్లమెంట్‌లో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ఒంటరిగా ఎందుకు చేయరు? ఒకవేళ ప్రభుత్వం మహిళా బిల్లును ఒంటరిగా (డిలిమిటేషన్ లేకుండా) ప్రవేశపెడితే, ప్రతిపక్షాలు కూడా దానికి మద్దతు ఇవ్వాల్సి వస్తుంది. ఎందుకంటే మహిళా రిజర్వేషన్‌ను నేరుగా వ్యతిరేకించడానికి ఏ పార్టీ సిద్ధంగా లేదు.కానీ,అలా ఒంటరిగా పాస్ చేస్తే, ప్రస్తుతమున్న 543 సీట్లలోనే 33% కేటాయించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రస్తుతం ఉన్న పురుష ఎంపీల సీట్లు చాలా వరకు తగ్గిపోతాయి.ఈ రిస్క్ తీసుకోవడానికి ఏ రాజకీయ పార్టీ అంత సులభంగా అంగీకరించదు.

ప్రత్యేక మెజారిటీ సవాలు: ఈ బిల్లులు చట్టం కావాలంటే రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల (2/3తీ౨) ప్రత్యేక మెజారిటీ సాధించాలి.ఈసారి పార్లమెంట్‌లో ఆ సంఖ్యాబలాన్ని కూడగట్టడమే ప్రభుత్వానికి అతిపెద్ద టాస్క్. మహిళా రిజర్వేషన్ అనేది కేవలం ఒక రాజకీయ హామీ లేదా రాయితీ కాదు,అది వారి ప్రాథమిక హక్కు. మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) చట్టసభల్లో లింగ సమానత్వాన్ని సాధించేందుకు పడిన ఒక చారిత్రాత్మక అడుగు అనడంలో ఎలాంటి సందేహం లేదు.అయితే, కేవలం ఒక చట్టాన్ని ఆమోదించడం మాత్రమే ముఖ్యం కాదు,దానిని సరైన సమయంలో క్షేత్రస్థాయిలోకి తీసుకురావడమే అత్యంత కీలకం.రాబోయే వర్షాకాల సమావేశాలలో ఈ బిల్లును కేవలం రాజకీయ ప్రయోజనాలకు లేదా నియోజకవర్గాల పునర్విభజన (**Delimitation**) వంటి వివాదాస్పద అంశాలకు పరిమితం చేయకుండా, ఫెడరల్ సమతుల్యతను కాపాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన మార్గాన్ని అన్వేషించాల్సి ఉంది. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించినప్పుడే,అది నిజమైన ప్రజాస్వామ్యంగా మరియు సంపూర్ణ సాధికారత కలిగిన సమాజంగా అవతరిస్తుంది.


మారుపాక నిహారిక
ములుకనూర్
9603363850




## చెన్నూరులో విద్యాభివృద్ధికి పెద్దపీట

### మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ




**మంచిర్యాల,ఆగస్టు 19 (తెంగాణ వాణి):**
కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.1.45 కోట్లతో చేపట్టిన రెనోవేషన్ పనులు పూర్తికావడంతో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తును రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో విద్యకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యతోనే జీవితాల్లో గణనీయమైన మార్పు సాధ్యమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌కేపీ ఓసీపీ--2కు స్థల పరిశీలన



**రామకృష్ణాపూర్,ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
రామకృష్ణాపూర్ ఉపరితల గని రెండో దశకు అవసరమైన అటవీ భూమికి బదులుగా సమాన విస్తీర్ణంలో పరిహార అటవీ పెంపకం చేపట్టేందుకు ప్రతిపాదించిన భూమిని అటవీ, సింగరేణి అధికారులు సంయుక్తంగా పరిశీలించారు.అటవీ సంరక్షణాధికారి ఎస్. శాంతారామ్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిసాన్ జాధవ్, ఇతర అటవీ అధికారులు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో కేకే ఓసీపీ పరిధిలోని సింగరేణి డంప్ భూమిని పరిశీలించారు. సుమారు 366.4198 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతిపాదించిన భూమి మట్టి నాణ్యత, నీటి లభ్యత, భౌగోళిక పరిస్థితులు, రాకపోకల సౌకర్యం, అటవీ పెంపకానికి అనుకూలతను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. గనుల విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన అనుమతుల అనంతరమే పనులు చేపడతామని సింగరేణి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అటవీ, సింగరేణి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫ్రభుత్వ పాఠాశాల విద్యార్ధులకు త్వరాగా యూనిఫారాలూ అందించాలనే డీ ఇ ఒ కు వినతి పత్రము



**ఎల్లారెడ్డి అగస్ట్ 19 తెలంగాణా వాణీ ప్రతినిధి**
కామారెడ్డి జిల్లా నందు డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లికార్జున్ గారికి కామారెడ్డి జిల్లా ప్రభుత్వ స్కూల్ నందు స్కూల్ పిల్లలకి యూనిఫామ్ డ్రెస్సులు త్వరగా అందజేయాలని తెలియజేయడమైనది స్కూలు చాలు అయ్యి రెండు నెలలు గడుస్తున్న స్కూల్ పిల్లలకు స్కూల్ డ్రెస్సులు అందజేయకపోవడం బాధాకరమని యూనిఫామ్ డ్రెస్సులు మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరగా అందజేయగలరని వినతి పత్రం ఇవ్వడం జరిగింది బిసి విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య బీసీ నాయకులు యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



**యెల్లారెడ్డి, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, రూ.26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, గౌరవ అధ్యక్షుడు కందరపు రాజనర్సు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా లింగంపేట్ మండలంలో రెండు రోజుల దీక్ష చేపట్టి ఎంపీడీవో నారాహరికి వినతిపత్రం అందజేశారు. జీవో 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈనెల 24, 25 తేదీల్లో కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు, అనంతరం నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దత్తురాం, గైని వెంకటి, గంగమణి, అనిత, భూమయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లిలో రూ.5 లక్షలతో బతుకమ్మ ఘాట్

**రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా శంకుస్థాపన**



**రామకృష్ణాపూర్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మున్సిపాలిటీ 5వ వార్డు అమరవాదిలో రూ.5 లక్షల జనరల్ ఫండ్‌తో నిర్మించనున్న బతుకమ్మ ఘాట్‌కు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ చౌక్ నుంచి అమరవాది వరకు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లలో క్యాతనపల్లి అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీ మేడం అభివృద్ధికి సుమారు రూ.100 కోట్లతో వివిధ పనులు చేపట్టామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఘాట్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్, నాయకులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకొండి - ఉన్నత స్థాయిని సాధించండి



**మందమర్రి ఆగస్టు 19 (తెలంగాణ వాణి)**
మందమర్రి యువత చేతుల్లోనే భవిష్యత్ ఉందని ఉద్యోగమే లక్ష్యంగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత స్థాయిని సాధించాలని మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ లు పేర్కొన్నారు. కాకా పౌండేషన్ ఆధ్వర్యం లో బుధవారం మందమర్రి లో ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభిచారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మందమర్రి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పోటీ పరీక్షల్లో విజయవంతంగా నిలబెట్టడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకూడదని,ప్రతి పేద విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగం సాధించే స్థాయికి ఎదగాలని అన్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాల యువతకు ఖరీదైన కోచింగ్ భారం కాకూడదనే ఉద్దేశంతో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అందుబాటులో ఉన్న శిక్షణను పూర్తిస్థాయిలో వినియోగించుకుని పట్టుదలతో చదవాలని సూచించారు.మందమర్రి నుంచి అత్యధిక సంఖ్యలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఎంపికై రాష్ట్రస్థాయిలో ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విధేశి భాష నేర్చుకొని ఇప్పటికే అనేక మంది ఉన్నత ఉద్యోగాలు సాధించారని అన్నారు.తెలంగాణ సాధనలో నీళ్లు, నిధులు, నియామకాలుప్రధాన ఆకాంక్షలని, యువతకు నియామకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే రాజకీయ వ్యాఖ్యలకు దూరంగా ఉండి, వారి కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యువతకు కేసులు కావాలా? ఉద్యోగాలు కావాలా? మీ భవిష్యత్తును మీరే నిర్ణయించుకోవాలని అన్నారు. కేటీఆర్ ఒక్కరే అమెరికా వెళ్లాలా? తెలంగాణ యువత విదేశాలకు వెళ్లి మంచి ఉద్యోగాలు సాధించకూడదా? అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కాకా ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువత, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదు..

- ఫోటో జార్నలిస్టుల సేవలు అమోఘం...
- 'ప్రపంచ ఫోటో గ్రఫీ డే'లో

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**



**నిజామాబాద్ ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ప్రెస్ క్లబ్ లో బుధవారం ప్రెస్ ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫర్ అంటే కేవలం కెమెరా ఆపరేటర్ కాదని, సమాజంలో జరిగే మంచి, చెడు, చారిత్రక సంఘటనలను భవిష్యత్ తరాలకు భద్రపరిచే వారన్నారు. చరిత్రలోని ఎన్నో ముఖ్య ఘట్టాలు ఫోటోల ద్వారానే మనకు గుర్తుండిపోతాయన్నారు.ప్రకృతి విపత్తులు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, విజయాలు, ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకం అని చెప్పారు.

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కృషి...**
జర్నలిస్టుల చిరకాల వాంఛ ఇళ్ళ స్థలాల కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. నిజామాబాద్ జర్నలిస్టుల్లో ఐక్యత ఉంటుందని, ఇదే ధోరణితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రతన్, ప్రధాన కార్యదర్శి భానుతేజ, గౌరవ అధ్యక్షుడు గోవిందరాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్, కోశాధికారి రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, సీనియర్ ఫోటో గ్రాఫర్ బాలరాజు, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు నాగేష్, సీనియర్ ఫోటో గ్రాఫర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు పురస్కారం

**.ప్రిన్సిపాల్ కు జిల్లా ఇంటర్ విద్యా అధికారి చే ఘన సన్మానం**



**నిజామాబాద్ ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ కు ఉత్తమ సేవలకు పురస్కారం లభించిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. బుధవారం ఉదయం బాలికల కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ అడ్మిషన్లు, ఫలితాలు, పచ్చదనం, పరిశు భ్రత, కళాశాల పాలన, నిర్వహణ, ఇతర సాంకేతిక, కళాశాల పనుల నిర్వహణలో ఉత్తమ సేవలకు ఈ పురస్కారం లభించిందని అన్నారు.విద్యార్థినిలు మంచి కళాశాల వాతావరణంలో విద్యనభ్యసించడానికి ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ కృషి చేస్తున్నారని అభినందించారు.కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పని తీరు, విద్యార్థుల ప్రతిభను పెంపొందించడంలో ప్రతి ఒక్కరు కృషి చేసారని, దాని ఫలితమే ఈ అవార్డ్ అని ప్రిన్సిపాల్ శ్రీ గంధం బుద్ధిరాజ్ అన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పని తీరు వల్లే 80శాతం కు పైగా ఫలితాలను సాధించామని, అలాగే అడ్మిషన్ లను 1400 లకు పైగా వచ్చాయి అని అన్నారు. తన ఆధ్వర్యంలో కళాశాలను ఒక బృందావనంలా తయారు చేయడానికి తమ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు సహకరించడం వల్లే ఈ అవార్డ్ సాధ్యమైందని ప్రిన్సిపాల్ అన్నారు.

## తుడుం దెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బంద్‌ను విజయవంతం



**ఉట్నూర్,ఆగస్టు :19(తెలంగాణ వాణి )**
ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ మండలలకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న అన్ని ఏజెన్సీ మండలలు ప్రశాంతంగా బందు ఆగస్టు 19 --- తుడుం దెబ్బ రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బంద్ విజయవంతం ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ బంద్‌కు ప్రజలు యువత ఉద్యోగులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు.షెడ్యూల్ ప్రాంత ఉద్యోగానియామక ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే పరిష్కరించాలి. 29 శాఖల షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని ఎం ఎస్ .జీవోనెంబర్.3 తో సహా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి.తెలంగాణ స్టేట్ పోలిష్ డిపార్ట్ మెంట్ సర్వీస్ రూల్స్ గెజిట్ నోటిఫికేషన్ తేదీ:10/05/2018 లో పేజీ నెంబర్ 3, 2 క్లాసు (అ) లో స్పష్టంగా షెడ్యూల్ ఏరియా కి 75% స్పష్టంగా పేర్కొన్నారు. జిఓ : ఎంఎస్ నం. 30 ట్రైబల్ వెల్డర్ తేది :11/07/2019 ప్రకారం నం. 5 సీరియల్ నెంబర్ 9 లో స్పష్టంగా పేర్కొన బడి ఉంది. జిఓ నం : 109 తేది 17/06/1988 ప్రకారం 75శాంతం షెడ్యూల్ ఏరియా అభ్యర్థులకు కేటాయించాల్సి ఉంది. వీటి ప్రకారం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ లు, 2015/2018 మరియు 2022లో కూడ ఈ నిబంధనల ప్రకారం ఇచ్చారు మాకు న్యాయం జరిగింది. కానీ పోలిస్ శాఖ జెనరల్ జీవో ల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వటం వలన 5వ షెడ్యూల్ ప్రాంత ఏజెన్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.అలాగే ఆదివాసీ గిరిజన యువతీ యువకులకు న్యాయం జరిగేలా ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతేక అద్వజర్ ఏర్పాటు కమిటీ ఏర్పాటు చేసి రానున్న నోటిఫికేషన్ ఓ ఏజెన్సీ ఐదవ షెడ్యూల్ ప్రాంతానికి ప్రతేకంగా ఆదివాసీ నిరోద్యోగులకు ఉద్యోగ ఉపాధిలో అవకాశాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా కమిటీ హెచ్చరించింది.లేని పక్కన తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉద్యమనికి ఉధృతం చేస్తాం అని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో కొట్నాక విజేయ్ కుమర్ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతి అధ్యక్షులు,పూర్కా బాపూరావు తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్, పెందోర్ దాదిరావు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు, విద్యార్థి సంఘం నాయకులు మాడవి బాలాజీ రాజ్ గోండ్ సేవ సమితి ఉట్నూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు



## పెన్ కాక్ సిలాట్ బంగారు పతక విజేతకు సన్మానం

**మందమర్రి ఆగస్టు 19 (తెలంగాణ వాణి)**
మహారాష్ట్ర రాష్ట్రం లోని నాసిక్ లో జరిగిన పెన్ కాక్ సిలాట్ జాతీయ స్థాయి పోటీలో మంచిర్యాల జిల్లా కు చెందిన విధ్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 11 పథకాలు సాధించారు. ఈ పోటీలో మందమర్రి పట్టణానికి చెందిన కొప్పు మోక్షిత్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి విజేతగా నిలిచాడు. ఈ సందర్బంగా కాక పౌండే షన్ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో భాగంగా బుధవారం మందమర్రికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎం పి గడ్డం వంశీ కృష్ణ లు మోక్షిత్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇదే స్పూర్తి తో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## అక్రమంగా నిల్వ చేసిన 150 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

### ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్.

**ఉట్నూర్, ఆగస్టు : 19 (తెలంగాణ వాణి )**
ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి పోలీసులు ఎస్ఐ ఈ సాయన్న ఆధ్వర్యంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వపై చర్యలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంద్రవెల్లి గ్రామంలోని కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించగా మూడు గోనె సంచుల్లో అక్రమంగా నిల్వ చేసిన 150 కిలోల పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడు చింతవార్ సంతోష్ (49) ను అదుపులోకి తీసుకుని విచారించగా, తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు, నిల్వ, రవాణా లేదా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఈ సాయన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జక్కుల రాజుకు ఘన సన్మానం



**మంచిర్యాల, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధ వారం సీనియర్ ఫోటోగ్రాఫర్ జక్కుల రాజును ఘనంగా సన్మానించారు. గత 20 ఏళ్లుగా కార్పొరేషన్‌కు సేవలందిస్తున్న రాజును డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, అసిస్టెంట్ కమిషనర్ జి. రాజు పుష్పగుచ్ఛం, శాలువాతో అభినందించారు. మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాలను తన కెమెరా ద్వారా రికార్డు చేస్తూ అందిస్తున్న సేవలు అభినందనీయమని అధికారులు కొని యాడారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరంజి గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం.

### ముఖ్య అతిథులుగండ్రత్ సుజాత, బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్, ఆగస్టు : 19 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జైనత్ మండలం కరంజి గ్రామానికి చెందిన బిక్కి లక్ష్మి - గంగన్న దంపతులకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయగా, బుధవారం వారు నిర్వహించిన గృహప్రవేశ వేడుకలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మరియు ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సారె పెట్టి సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సొంత ఇంటి కలను ఇందిరమ్మ పథకం ద్వారా సాకారం చేస్తోందని అన్నారు. గడచిన పదేళ్లలో ఎన్నో వినతులు సమర్పించినా లభించని ఇళ్లు, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు అందుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరు ఆందోళన చెందవద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు వెంకట, తుడం వినోద్ , సుదర్శన్, వినోద్ , జగదీశ్ రెడ్డి , పోత రెడ్డి , జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్ , గ్రామస్తులు నాగేష్ , వామన్, అశోక్, పోచన్న, అలీమ్, తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరులో అసంపూర్తిగా ఉన్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం పనులు పూర్తి స్థాయిలో నిర్మాణం చెయ్యాలి

### బిజెపి మండల అధ్యక్షులు పారెల్లి మహేష్



**చిలుకూరు ఆగస్టు 19 (తెలంగాణ వాణి )**
చిలుకూరు మండల కేంద్రంలో కొంతకాలంగా అసంపూర్తిగా ఉన్న చిలుకూరు పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పారెల్లి మహేష్ బుధవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలియజేశారు. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

## గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి

### దహన ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం



**వనపర్తి : ఆగస్టు 19, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
దొడగుంటపల్లి గ్రామానికి చెందిన కేశపాగ భాగ్యమ్మ, రాములు కుమార్తె కేశపాగ చెన్నమ్మ మంగళవారం గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషాద సమయంలో మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పిస్తూ గ్రామ పెద్దలు రాజశేఖర్ శెట్టి, పి. రవీందర్, గుపాని వెంకటేష్, కొమ్ము చెన్నయ్య మాదిగ, కొమ్ము చెన్నకేశవులు మాదిగ తదితరులు కలిసి దహన ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము తిరుపతయ్య మాదిగ, కొమ్ము సాయిలు మాదిగ ,కొమ్ము వెంకటయ్య తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేశపాగ చెన్నమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు.

## జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి బీసీ పొలిటికల్ జెఎసి విజ్ఞప్తి




**వనపర్తి : ఆగస్టు 19, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వైద్యులు అంటేనే భగవత్ స్వరూపుడైన నారాయణ స్వామితో సమానమని బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నూతనంగా నియమితులైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ గారిని బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ నాయుడు మాట్లాడుతూ అన్ని వృత్తులలో కెల్లా వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, అలాంటి వైద్య వృత్తిలో జిల్లా అధికారిగా నియమితులైన డాక్టర్ భాస్కర్ నాయక్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని సమన్వయం చేసి ఎలాంటి సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ఏర్పాట్లు చేసి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలని కోరారు. ప్రజలకు మంచి చేసే ప్రతి అధికారిని బీసీ పొలిటికల్ జేఏసీ వెన్ను తట్టి ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి ఆస్కని రమేష్, నిప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 100కు పైగా కేసులు.. జనగామలో కిలాడీ దొంగ అరెస్ట్



**జనగామ/బచ్చన్నపేట, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
100కు పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్న పాత నేరస్థుడు సయ్యద్ అమీద్‌ను జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆటో డ్రైవర్‌గా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను రెక్కీ చేసి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో పీడీ యాక్ట్ కింద జైలు శిక్ష అనుభవించినా, తిరిగి దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో వైద్య సేవల పరిశీలన



**హసన్‌పర్తి, ఆగస్టు 19(తెలంగాణ వాణి ప్రతినిధి**
హసన్‌పర్తి మండలంలోని జయగిరి, అనంతసాగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర భవనాలను గ్రామస్తులు, టీజీ ఎంఐడీసీ ఏఈ రత్నాకర్, సర్పంచ్‌లతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పీహెచ్‌సీ అధికారి డాక్టర్ రాం భార్గవ్, అనంతసాగర్ సర్పంచ్ దయాకర్, వైద్యాధికారులు డాక్టర్ మల్లేశ్, హెల్త్ సూపర్‌వైజర్ లచ్చు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేయాలి
- పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క )



**నిజామాబాద్ ఆగస్టు 19: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యమని జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పి ఏ సీ) సమావేశం బుధవారం నిజామాబాద్‌లోనీ దుబ్బ లో నిర్వహించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి,పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ( సీతక్క ), టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నాయకులు ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలను పార్టీతో అనుసంధానం చేయాలని సూచించారు. పార్టీ అనుబంధ సంఘాలు, యువజన, మహిళా, విద్యార్థి, కార్మిక, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగాలను మరింత క్రియాశీలం చేయాలన్నారు.
టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేసి ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని అన్నారు. పార్టీ కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ..కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని, బూత్ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. కొత్తగా పార్టీకి వచ్చే యువతను ప్రోత్సహిస్తూ వారికి సంస్థాగత బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే మదన్ మోహన్, బాల్కొండ, ఆర్మూర్ ఇంచార్జీ సునీల్ రెడ్డి, వినయ్ రెడ్డి, యూసుఫ్ అలీ, కాసుల బాలరాజ్, అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు మనాల మోహన్ రెడ్డి, ఇరవత్రి అనిల్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

### జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, ఆగస్టు 19 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జిల్లా ఇంచార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

**నిజామాబాద్, ఆగస్టు 19 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

## జంగమాయపల్లిలో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



**ఎల్లారెడ్డి, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి మండలం జంగమాయపల్లిలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్పరిణామాలు, రోడ్డు భద్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్రహ్మణ్య చారి, సర్పంచ్ రాములు, పీఏసీఎస్ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధి రాములు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేగొండలో 444.75 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రేగొండ మండల కేంద్రంలోని పురాతన రైస్‌మిల్ గోడౌన్‌పై సివిల్ సప్లైస్ అధికారులు దాడి చేసి 444.75 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించిన అధికారులు, పంచనామా అనంతరం బియ్యాన్ని మారుతి ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వాహన యజమాని కమ్ డ్రైవర్ తూర్పాటి శ్రీనివాస్, సాంబశివుడు, గోడౌన్ యజమాని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయండి




**సూర్యాపేట, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
కరీంనగర్‌లో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, కనీస వేతనం రూ.26 వేలు, కాంట్రాక్టు విధానం రద్దు, స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బెజవాడ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

## పట్టణంలోని తిరుపెల్లి వాడలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- తనిఖీలలో 179 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 1 కార్, స్వాధీనం
- ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి



**ఆదిలాబాద్, ఆగస్టు : 19 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా కేంద్రంలోని తిరుపల్లి మరియు ఖిల్లా ఏరియాలలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలు మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారుజామున నుండి నిర్వహించినట్లు ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 179 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 1 కార్, స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు అమర్చిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురి నిందితుల వద్ద మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఎం వెంకట నర్సయ్య, ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్ర వర్ధన్, సిఐలు బి సునీల్ కుమార్, బి ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెయ్యి మాటల నిజాన్ని చూపించే శక్తి ఫోటో జర్నలిజానిదే

### జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,



**వనపర్తి : ఆగస్టు 19, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఒక్క ఫోటో వెయ్యి మాటల భావాన్ని చెబుతుంది ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా నిలుపుతుంది.. ఒక తరానికి చెందిన చరిత్రను మరో తరానికి అందిస్తుంది. సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఎలాంటి అలంకరణ లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తి ఫోటో జర్నలిజానిదని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోటో జర్నలిస్ట్ లతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి ఫోటో జర్నలిస్టులకు శుభాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్క ఫోటో వెయ్యి మాటలకు సమానం. ఒక క్షణాన్ని బంధించే కెమెరా.. ఆ క్షణాన్ని చరిత్రగా నిలబెట్టే శక్తిని కలిగి ఉంటుంది. సమాజంలో జరిగే ప్రతి సంఘటనకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తూ, నిజాన్ని ఎలాంటి భేషజం లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తివంతమైన మాధ్యమం ఫోటో జర్నలిజం ఫోటోగ్రఫీ కేవలం ఒక కళ మాత్రమే కాదు. అది చరిత్రను భద్రపరిచే బాధ్యత, సమాజాన్ని ప్రతిబింబించే అద్దం, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే ఆయుధం. మన సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక మార్పులు, ప్రజల జీవన విధానం, కీలక సంఘటనలు.. ఇవన్నింటినీ భావితరాలకు అందించే సజీవ దస్తావేజులు ఛాయాచిత్రాలు. ఒక మంచి ఫోటోలో ఒక కథ ఉంటుంది.. ఒక భావోద్వేగం ఉంటుంది.. ఒక సందేశం ఉంటుంది.. ఒక చరిత్ర ఉంటుంది. ముఖ్యంగా ఫోటో జర్నలిస్టులు ప్రతికూల పరిస్థితుల్లోనూ సంఘటనలను ప్రజల ముందుకు తీసుకురావడంలో చేస్తున్న కృషి అభినందనీయం. సమాజానికి వాస్తవాలను చూపిస్తూ ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడంలో వారి పాత్ర ఎంతో కీలకం. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో జర్నలిస్టులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ కెమెరా ఎల్లప్పుడూ నిజాన్ని బంధిస్తూ.. సమాజానికి స్ఫూర్తినిచ్చే చిత్రాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పి, బాలాజీ నాయక్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, అన్ని పత్రికల ఫోటో జర్నలిస్టులు, రాము, బాలరాజు, యూసుఫ్ యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్, ఆంజనేయులు, జ్ఞానమూర్తి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనేవెనుకకు తీసుకోవాలి

### --వరంగల్ జిల్లా అధ్యక్షులు కొమ్ముక రవి

**నర్సంపేట: ఆగస్టు19(తెలంగాణ వాణి ప్రతినిధి)**

నర్సంపేట పట్టణ కేంద్రం లో నుండి నిరసన వ్యక్తం చేయడం జరుగుతుంది, శక్తి నుండి పాలిటెక్నిక్ విద్యను తొలగించి ఎస్బి టెట్ లోనే కొనసాగించాలని , ఈ సందర్భంగా పిడిఎస్యు వరంగల్ జిల్లా అధ్యక్షులు కొమ్ముకరవి మాట్లాడుతూ... శక్తి( స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనవేటివ్ ) లో పాలిటెక్నిక్ ని ఏకపక్షంగా విలీనం చెయ్యడాన్ని పాలిటెక్నిక్ విద్యార్థులు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పాలిటెక్నిక్ విద్యను ఎస్బి టెట్ లోనే కొనసాగించి ఉన్నత విద్యా మండలి కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని శక్తిలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేస్తే వారి ఉన్నత విద్యా అవకాశాలపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని అలానే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్లో ఉన్న స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యారంగాన్ని విలీనం చేయడం వల్ల విద్యార్థుల పైన అధిక ఫీజుల భారం పడే అవకాశం ఉందని కావున తక్షణమే ప్రభుత్వం పునరాలోచించి పాలిటెక్నిక్ విద్యను ఉన్నత విద్యా మండలి లోనే కొనసాగించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో విద్యార్థుల ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు .

## 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత...



**వేములవాడ రూరల్,ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**

అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేములవాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన వట్టెంల గ్రామంలో చోటుచేసుకుంది.వేములవాడ రూరల్ మండల పరిధిలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వట్టెంల గ్రామంలోని గుంట ఎల్లయ్య గుడిసెలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రెండు ఆటోల్లో తరలిస్తున్న మరో 10 క్వింటాళ్ల బియ్యాన్ని కూడా పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, రెండు ఆటోలను సీజ్ చేశారు.తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయించేందుకు నల్గొండ వైపు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో వానరాసి శ్రీనివాస్, మోతె భానుప్రసాద్, గుంట ఎల్లయ్యలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు.పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం, కానిస్టేబుల్ దేవరాజు, పోలీసు సిబ్బందిని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అభినందించారు.

## ఘనంగా ఫొటో గ్రఫీ దినోత్సవ వేడుకలు



**ధర్మారం, ఆగస్టు19 (తెలంగాణ వాణి )**

187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మారం మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.మొదటగాఫోటోగ్రాఫర్లు ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫోటోగ్రఫీ రంగానికి ఆయన చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా సభ్యులు స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్అధ్యక్షులు ఎస్.కె. హుస్సేన్, ప్రధాన కార్యదర్శి లాడే రవి(సిరి) ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు పోగుల విజయకుమార్, ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్ ల సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రత్యేకంగా రూపొందించిన జెండాను యూనియన్ అధ్యక్షులు గొల్లశెట్టి కంటేశ్వర్, సంఘం సభ్యులతో కలిసి జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ జననీ జయకేతనంను ఆలపించారు. అనంతరం కేకు కట్ చేసి స్వీట్లు తినిపించుకుంటూ ఒకరినొకరు ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంఘం సభ్యులు జెండాతో క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొని ఫోటోగ్రాఫర్ల ఐక్యత వర్ధిల్లాలి జై ఫోటోగ్రాఫర్ జై జై ఫోటోగ్రాఫర్" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం కోసం మనం మన కోసం సంఘం అనే నినాదంతో ఫోటోగ్రాఫర్ల ఐక్యత, సంక్షేమం కోసం సంఘటితంగా పనిచేయాలని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జెండా ఆవిష్కరణ,కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమం

### అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రచ్చ శ్రీలక్ష్మి



**డిండి ఆగస్టు 19( తెలంగాణ వాణి ప్రతినిధి)**

డిండి మండలంలో గోనకొల్లు గ్రామంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రచ్చ శ్రీలక్ష్మి గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి, ప్రస్తుత పరిస్థితులపై వారి అభిప్రాయాలను మరియు పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఇకపై వరి నాట్లు వేయకుండా రైతులకు అవగాహన కల్పించారు. అలాగే నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలైన కందులు, పెసలు, మినుములు మరియు నూనెగింజల పంటలైన నువ్వులు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.ప్రస్తుత వాతావరణ మరియు నీటి పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణను పాటించి, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రెహనా, సీఈఓ బాల్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల శశిధర్ రెడ్డి, , రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు,

# ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 19(తెలంగాణ వాణి ప్రతినిధి )**

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ (IDOC) సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, రోస్టర్ రిజర్వేషన్లు, నిధుల వినియోగం, సంక్షేమం మరియు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం (POA) అమలుపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌లతో కలసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా ఛైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉప ప్రణాళిక నిధులు మంజూరైన నిధులను ఎస్సీ, ఎస్టీ ఆవాస ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలని, నిధులు పక్కదారి పడితే సంబంధిత అధికారులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. కేసుల విచారణ పరిహారం ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాల కేసుల్లో విచారణ, పరిహారం అందించడంలో జాప్యం చేయవద్దు. హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు గురైన బాధిత కుటుంబాలకు పరిహారంతో పాటు ఉపాధి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి కల్పించి పునరావాసం అందించాలి. ఉద్యోగాల్లో రోస్టర్ పద్ధతి ప్రభుత్వ శాఖల్లో ప్రమోషన్లు కల్పించేటప్పుడు రోస్టర్




రిజర్వేషన్లను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.
సివిల్ రైట్స్ డే ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే 'పౌర హక్కుల దినోత్సవం'లో తహశీల్దార్లు, ఎస్ఐలు, ఇతర అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి. సిసి కెమెరాల ఏర్పాటు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు, భూ వివాదాల నివారణకు పంచాయతీ లేదా సీఎస్ఆర్ (CSR) నిధులతో ప్రధాన కూడళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాధ్యతాయుత ప్రవర్తన కార్యాలయాలకు వచ్చే బాధితుల పట్ల అధికారులు మానవీయ కోణంతో ప్రవర్తించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

### అధికారుల స్పందన

బాధితులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేస్తామని, పౌర హక్కుల దినోత్సవాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బాధితుల ఫిర్యాదులపై తక్షణమే కేసులు నమోదు చేస్తున్నామని, కమిషన్ నుండి వచ్చిన దరఖాస్తులపై వేగంగా విచారణ జరుపుతున్నామని ఎస్పీ సంకీర్త్ వివరించారు.?ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, ఎస్సీ అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీమ్, ఆర్డీఓలు, డీఎస్పీలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ రోడ్లపై పాదరక్షల స్టాండ్లు...

- బీజేపీ కౌన్సిలర్ల తీవ్ర ఆగ్రహం
- ఆదాయానికి గండి కొడుతున్నారంటూ ఆరోపణ
- రోడ్లపై ఏర్పాటు చేసిన పాదరక్షల స్టాండ్లను తొలగించాలని డిమాండ్

**వేములవాడ,ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**

మున్సిపల్ స్థలాలను వినియోగించుకుంటూ రాజన్న ఆలయ అధికారులు టెండర్లు నిర్వహించారని,తద్వారా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోందని బీజేపీకి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ రోడ్లపై ఏర్పాటు చేసిన పాదరక్షల స్టాండ్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బుధవారం వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో వారు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఆలయ అధికారులు నిర్వహించిన పాదరక్షల టెండర్ సుమారు రూ.36 లక్షలకు ఖరారైందని తెలిపారు. అయితే టెండర్‌కు సంబంధించిన ప్రత్యేక స్థలం లేకపోవడంతో మున్సిపల్ రోడ్లపైనే షెడ్ల మాదిరిగా స్టాండ్లు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆలయ పరిసరాల్లో నాలుగైదు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో మున్సిపల్ పరిధిలోని రోడ్లు, స్థలాలు ప్రైవేటు వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.ఆలయ గోడలకు ఆనుకొని పాదరక్షల స్టాండ్లు ఏర్పాటు చేయడం వల్ల పరిసరాల పరిశుభ్రత దెబ్బతింటోందని, భక్తుల రాకపోకలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని కౌన్సిలర్లు అన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా,



సౌకర్యవంతంగా ఉంచాలని కోరారు.మున్సిపల్ కమిషనర్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి మున్సిపల్ స్థలాలను గుర్తించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రోడ్లను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ పరిసరాల్లో ఉన్న మున్సిపల్ స్థలాలను గుర్తించి వాటిని మున్సిపల్ ఖాతాలోకి తీసుకోవాలని సూచించారు.మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాదరక్షల స్టాండ్లకు టెండర్ నిర్వహిస్తే సుమారు రూ.36 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని కౌన్సిలర్లు తెలిపారు. అధికారులు స్పందించకపోతే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఆర్జేడీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు.ఈ సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు కొండ్లెపు ముత్యం, వంగాల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు బోనాల శివ, రేగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ నిబంధనలపై భగ్గుమన్న పాలిటెక్నిక్ విద్యార్థులు

**తిమ్మాపూర్, ఆగస్టు 19, (తెలంగాణ వాణి ప్రతినిధి )**

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జాతీయ రాజీవ్ రహదారిపై వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చేపట్టిన రాస్తారోకో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పాలిటెక్నిక్ డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులకు బీటెక్ రెండో సంవత్సరంలో (లెటరల్ ఎంట్రీ) ప్రవేశం కల్పించకుండా, తిరిగి ఇంటర్మీడియట్ చదవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.?ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిప్లమా విద్యకు ప్రత్యేక గుర్తింపును ఇవ్వాలని, ఎస్బీటీఈటీని స్వతంత్రంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే వివాదాస్పద జీవో 97తో పాటు శక్తి స్కీం నిబంధనలను వెంటనే రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై సుమారు అరగంటపాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు వైపులా భారీగా వాహనాలు బారులు తీరాయి. ఈ సమయంలో అటుగా వచ్చిన ఒక అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో, దానిని పంపించే విషయంలో పోలీసులకు, విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఇదే సమయంలో వార్త కవరేజ్



చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కూడా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై బైఠాయించడం చట్టరీత్యా నేరమని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు తేల్చిచెప్పారు. డిప్లమా విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరం చేసే ఈ నిబంధనలను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి.

## నర్సంపేట బంద్.. నాగుర్ల వెంకటేశ్వర్లు గృహనిర్బంధం



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో,( ఆగస్టు 19 ):**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని పోలీసులు, మున్సిపల్ సిబ్బంది తొలగించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. విగ్రహం తొలగింపును నిరసిస్తూ బీఆర్ఎస్ బుధవారం నర్సంపేట బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి పలువురు బీఆర్ఎస్ నాయకులను గృహనిర్బంధం చేశారు. ఇందులో భాగంగా సుబేదారి ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లును గృహనిర్బంధం చేశారు. మరికొందరు నాయకులను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విగ్రహం తొలగింపుపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వం, అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నర్సంపేటలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు.



## గృహప్రవేశ వేడుకకు ముఖ్య అతిథిగా జి. అంజయ్య

**రాయికోడ్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**

రాయికోడ్ మండలం అల్లాపూర్‌లో ఉసిరికెపల్లి మల్లన్న--నాగమణి దంపతుల నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జి. అంజయ్య ముఖ్య అతిథిగా హాజరై గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**వేములవాడ, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**



లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బచ్చు వంశీకృష్ణ తెలిపారు. మహాలక్ష్మి డెంటల్ కేర్ సహకారంతో జరిగే శిబిరంలో కంటి పరీక్షలు, దృష్టి పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ, వైద్యుల సలహాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## అయిలాపూర్‌లో పంట కుంట పనులు ప్రారంభం

**తెలంగాణ వాణి కోరుట్ల రూరల్ ఆగస్టు 19:**

కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో రైతు పొలంలో పంట కుంట నిర్మాణ పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ ప్రారంభించారు. వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు, రైతులకు సాగునీటి భద్రత కల్పించే లక్ష్యంతో పంట కుంటల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనిస్తూ పంట కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవలీక, ఏపీవో ధారాసింగ్, డీఆర్పీ నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, సీసీ రమేష్, మహిళా సమైక్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి




**కోరుట్ల రూరల్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**

పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జీవో నంబర్ 97ను రద్దు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. కోరుట్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. శక్తి కాలేజీని పాలిటెక్నిక్ కళాశాలతో విలీనం చేసే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ మడవేణి సునీల్ తెలిపారు. ప్రభుత్వం నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి -సీపెల్లి రవీందర్



**ధర్మారం, ఆగస్టు19 (తెలంగాణ వాణి)**

గ్రామ పంచాయతీ కార్మికులు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం ధర్మారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేముల సుమలతకు కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులతో పాటు పలు బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కొంతమంది సర్పంచ్‌లు కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని, ఇటువంటి చర్యలను వెంటనే అరికట్టాలని కోరారు.కార్మికులతో గౌరవప్రదంగా వ్యవహరించి, వారికి చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మికులకు వేతనాలు సకాలంలో అందక కుటుంబాల పోషణకు ఇబ్బందులుఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.గ్రామ పంచాయతీ కార్మికులపై అమలవుతున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, ప్రతి కార్మికుడికి నిర్దిష్టమైన విధులు, బాధ్యతలు నిర్ణయించాలని సూచించారు. అలాగే పని ప్రదేశాల్లో రక్షణ పరికరాలు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అధికారులు కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో కార్మికులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శాతరాజుల గంగాధర్, కార్యదర్శి ఏదుల్ల రవికుమార్, గౌరవ అధ్యక్షుడు కూనమల్ల అశోక్, కొత్తూరి నవీన్, సత్యంరాజు, రెడ్డపాక రమేష్, కన్న కరుణాకర్, భూమమ్మ, అరుణ, రాజమ్మతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.





## ఒక్క ఫోటో... వెయ్యి మాటల భావం

**తెలంగాణ వాణి,ఉమ్మడి వరంగల్ బ్యూరో, (ఆగస్టు 19 ) :**
ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లిలో ఫోటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఫోటోగ్రాఫర్లను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో జరిగే ప్రతి ముఖ్య ఘటనను కెమెరా కంటితో చిత్రీకరించి ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్లు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. "ఒక్క ఫోటో వెయ్యి మాటల భావాన్ని ప్రజలకు చేరవేస్తుంది" అని పేర్కొన్న ఆయన, జర్నలిజంలో ఫోటోగ్రఫీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా ఫోటోగ్రాఫర్ల సేవలు మరువలేనివని తెలిపారు. కెమెరా కంటితో సమాజాన్ని చూసి, వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రతి ఫోటో జర్నలిస్టుకు సెల్యూట్ చేస్తున్నానని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఫోటోగ్రాఫర్ల సేవలను గుర్తించి వారిని సన్మానించడం సంతోషకరమన్నారు. ఫోటో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చి, వారికి సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు ఫోటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు.

## తెలుగు ఉమ్మడి రాష్ట్రాల పోటీలో రాంబాబుకు తృతీయ బహుమతి...





**జమ్మికుంట, ఆగస్టు 19, (తెలంగాణ వాణి ప్రతినిధి):**
187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా, ఖమ్మం ఫోటోగ్రఫీ కాంటెస్ట్ 2026 పోటీల్లో జమ్మికుంటకు చెందిన ఫోటోగ్రాఫర్ విజయగిరి రాంబాబు రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో తృతీయ బహుమతి సాధించాడు. " పండుగలు" అనే అంశంలో, రాంబాబు తీసిన ఫోటో నిర్వాహకులను ఆకట్టుకుంది. ఈ మేరకు ఖమ్మం టీఎన్జీవో భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో, ఖమ్మం అడిషనల్ డీసీపీ బొజ్జ రామానుజం చేతుల మీదుగా రాంబాబు అవార్డు అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఫోటోగ్రఫీ రంగంలో రాంబాబు తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రకృతి, సంస్కృతి, సాంప్రదాయాలపై గతంలో రాంబాబు తీసిన ఛాయాచిత్రాలకు రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కాయి. ఇటీవల హైదరాబాద్ కె.వి.ఆర్ పార్కులో తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కెమెరా కళ్ళు పోటీలో రాంబాబు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. లంబాడి గిరిజ నుల జీవనశైలిని ప్రకృతి రమణీయతను తన కెమెరాలో బంధించి జిల్లా నుంచి రాష్ట్ర జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరిచారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాంబాబును ఉభయ రాష్ట్రాల్లోని ప్రముఖ ఫోటోగ్రాఫర్లు మరియు స్థానిక ఫోటోగ్రాఫర్లు ఆయన శిష్యులు అభినందించారు.

## ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా నిరుపేద విద్యార్థులకు చేయూత




**జమ్మికుంట, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి గార్డియన్ స్కూల్‌లో ముగ్గురు నిరుపేద విద్యార్థులకు బీఎస్పీ నాయకుడు డాక్టర్ అంబాల ప్రభాకర్ దాతల సహకారంతో రూ.10 వేల విలువైన పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజానికి సేవ చేయాలని సూచించారు. దసరా సందర్భంగా విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకుడు మారపల్లి మొగిలయ్య, పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ అంకూస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై "తగ్గేదేలే"

- వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- గత పాలకవర్గం అక్రమాలను త్వరలోనే బయటపెడతాం
- 9వ వార్డు కౌన్సిలర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై అనుచిత విమర్శలు చేస్తే సహించేది లేదు





**వేములవాడ,ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు గత మున్సిపల్ పాలకవర్గం, అక్రమ నిర్మాణాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అనుభవంతో ప్రస్తుత పాలకవర్గానికి అమూల్యమైన సలహాలు, సూచనలు ఇస్తారని భావిస్తే, పాలకవర్గంపై లేనిపోని నిందలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇటువంటి అసత్య ప్రచారాల వల్ల సదరు నాయకులు ప్రజల ముందు చులకన అవుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమ కట్టడాలు, ఇచ్చిన అనుమతుల వివరాలను పూర్తి స్థాయిలో బయటకు తీసి ప్రజల ముందు ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. ?గత కొద్దిరోజులుగా ప్రస్తుత పాలకవర్గంపై 9వ వార్డు కౌన్సిలర్ చేస్తున్న అసత్య ప్రచారాలను చైర్మన్ తీవ్రంగా ఖండించారు. జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో ఒక నిర్మాణదారునికి మున్సిపాలిటీ నుంచి అనుమతి ఒకచోట ఇస్తే, అతను మరొక చోట నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు రాగానే వెంటనే స్పందించి నోటీసులు జారీ చేశామని, అంతేకాకుండా ఈ నెల 3వ తేదీన ఆ నిర్మాణ అనుమతిని కూడా రద్దు చేయడం జరిగిందని విలేకరులకు వివరించారు. కొంతమంది ఈ అనుమతుల రద్దు తమ వల్లే జరిగిందంటూ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.?అక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వడంలో తమ పాలకవర్గం ఎలాంటి లోపాయికారీ ఒప్పందాలు చేసుకోలేదని పుల్కం రాజు స్పష్టం చేశారు. గత పాలకవర్గంలో పనిచేసిన వారే ఇటువంటి ఒప్పందాలు చేసుకుని, ఆమ్యామ్యాలకు అలవాటు పడి ఉండవచ్చని చమత్కరించారు. తమకు అలాంటి ఆమ్యామ్యాలు అలవాటు లేదని, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం మాత్రమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. 11వ వార్డులో జరుగుతున్న అక్రమ కట్టడాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.?కొందరు వ్యక్తులు కేవలం వ్యక్తిగత సానుభూతి పొందేందుకే స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలతో విమర్శలు చేస్తున్నారని పుల్కం రాజు మండిపడ్డారు. తమ నేతపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులే అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ ఫిర్యాదుల ఆధారంగానే అధికారులు పట్టణంలోని అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాంటప్పుడు ఒక నిర్మాణదారుడు స్థానిక ఎమ్మెల్యే వల్ల తమకు ప్రాణభయం ఉందని మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.?ఈ అక్రమ నిర్మాణాల కుట్ర వెనుక ఎవరి హస్తం ఉందో వేములవాడ పట్టణ ప్రజలందరికీ బాగా తెలుసని చైర్మన్ వ్యాఖ్యానించారు. గత ఐదేళ్ల మున్సిపల్ పాలనలో అనేక అక్రమ కట్టడాలు జరిగాయని, ఆ వ్యవహారాలన్నింటినీ త్వరలోనే పూర్తి ఆధారాలతో సహా బయటకు తీస్తామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు చెప్పే మాటలను నమ్మే పరిస్థితిలో వేములవాడ ప్రజలు లేరని, వారి ప్రవర్తన చూస్తుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉందని విమర్శించారు. ?వేములవాడ పట్టణాన్ని తమ సొంత కుటుంబంగా భావిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని పుల్కం రాజు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూర్తి సహకారంతో పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు ప్రస్తుత పాలకవర్గంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ పాలకవర్గం ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకమైన పాలనను ప్రజలకు అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కేవలం ప్రభుత్వ నిబంధనలకు లోబడి, చట్టప్రకారమే జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

## మాచనపల్లిలో చెట్ల తొలగింపుపై ఉద్రిక్తత



**జమ్మికుంట, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మాచనపల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రదేశంలో 70కిపైగా చెట్లను తొలగించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో నాటిన చెట్ల సంరక్షణకు ప్రజాధనం ఖర్చు చేశామని, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా వాటిని తొలగించడం సరికాదని అన్నారు. అలాగే జాతీయ జెండా గద్దెను కూల్చివేసి పార్టీ గద్దెలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఘటనపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ఫోటో వీడియో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌కు వినతి



**నారాయణఖేడ్ :ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఫోటో, వీడియో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నారాయణఖేడ్ డివిజన్ ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ ఉమా హారతికి వినతిపత్రం సమర్పించారు. ఫోటో, వీడియో గ్రాఫర్ల సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సంఘ భవనం మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు మంగల్పేట్ భవానీమాత ఆలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు ఆర్థిక సహాయం.



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 19 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన జవ్వాజి శ్రీనివాస్ ఇటీవల దుబాయిలో మరణించారు.అతనికి ఇద్దరు ఆడపిల్లలు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు గతంలోనే అతని భార్య మరణించింది.అనాధలైన ఆ చిన్న పిల్లలకు గ్రామానికి చెందిన సేవా భావం కలిగిన వ్యక్తులు అందరూ కలిసి ఒక లక్ష ఇరవై ఒక్క వెయ్యితొమ్మిది వందలయేనబై 1,21,980 రూపాయలు బాధిత కుటుంబానికి అందజేసారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి యువకులు నేమూరి నరేష్,పాశం విపుల్ నాయకులు మార బుచ్చన్న, జవ్వాజి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోసంగి కుల నాయకులకు సన్మానం



**రాయికల్: ఆగస్టు 19(తెలంగాణ వాణి):**
రాయికల్ పట్టణ గోసంగి కుల అధ్యక్షులు అల్లే పురుషోత్తం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధికార ప్రతినిధి కలమడుగు తిరుపతి మరియు గోసంగి కుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా కమిటీ నాయకులు జిల్లా గౌరవ అధ్యక్షులు నేరళ్ళ వినోద్ కుమార్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలమడుగు రమేష్,జిల్లా అధికార ప్రతినిధిగా మొలుగు వెంకటేష్ లను బుధవారం రోజున రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.అనంతరం సంఘానికి నిస్వార్థంగా సేవ చేసి సంఘాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని నూతన నాయకులకు సలహాలు సూచన లు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ గోసంగి కుల సభ్యులు యూత్ అధ్యక్షులు కలమడుగు స్వామి,కేతం గంగరాజం,రామచంద్రం,నేరెళ్ల విజయ్, కలమడుగు పెద్ద నర్సయ్య,మల్లేష్, సంపతి గంగాధర్,సోరపాక రాజేశం, సందెల గణేష్,రాకేష్,సంపతి మధు కుమార్ (బన్ని ),మోనుగురి నరేష్, కాదాస్ అన్వేష్,కలమడుగు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం

### సిఆర్పి మండలోజురవీందర్.



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 19 (తెలంగాణ వాణి విలేకరి)**
విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేయడం ద్వారా వారికి మరింత నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యమని సిఆర్పి రవీందర్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా ఇబ్రహీ ంపట్నం మండలంలోని ఎంపిక చేసిన పాఠశాలలో భాగంగా మండల పరిషత్ ఉన్నత పాఠశాల కోజన్ కొత్తూరు నందు ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసి స్పాట్ అసెస్మెంట్ నిర్వహిం చారు.దీని ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయి,ప్రతిభ పాటలను మూల్యాంకనం చేయవచ్చునని వారు తెలిపారు.ముఖ్యంగా రెండవ తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షిస్తూ తెలుగు,ఇంగ్లీషులలో ధారాళంగా చదవడం రాయడం గణితంలో ప్రాథమిక పరిక్రియలను వంటి అంశాలను పరీక్షిస్తున్నట్టు తెలపారు .పాఠశాలప్రధానోపాధ్యాయురాలు శోభారాణి పాల్గొన్నారు.



## భక్తుల సౌకర్యార్థం శివలింగానికి పీవీసీ షెడ్

**వీణవంక, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మల్లారెడ్డిపల్లి గ్రామంలోని మానేరు వాగు ఒడ్డున ప్రతిష్ఠించిన శివలింగానికి దాతల సహకారంతో పీవీసీ షెడ్ నిర్మించి అందంగా అలంకరించారు. గంగాస్నానాలకు వచ్చే భక్తులు పూజలు, మొక్కులు తీర్చుకునేందుకు ఇది సౌకర్యంగా మారింది. షెడ్ నిర్మాణానికి చొరవ చూపిన మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## కోతుల బెడద నియంత్రణకు పటిష్ట చర్యలు



**మెదక్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో కోతుల బెడద నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోతుల బెడదతో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పూర్తిగా నివారించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## తపస్ పల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



**కొమురవెల్లి, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు తపస్ పల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నందున రిజర్వాయర్‌లోని నీటిని కొమురవెల్లి, చేర్యాల మండలాల చెరువులకు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన డీఈ రేపు నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## టీఎస్ సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం





**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 19:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డి పేట మండలంలోని టీఎస్ సీపీఎస్ ఈయు మండల యూనియన్ రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు ఈనెల 23న నిర్వహించి చలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాల్గొనాలని గోడపత్రికలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాల్పేటలో మధ్యాహ్న భోజనం విరామం సమయంలో మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి యూనియన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రతి ఒక్క ఉద్యోగి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సిపిఎస్ వద్దురా ఓపిఎస్ ముదుర అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉపాధ్యాయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరకాలలో పోటీ చేసేది నేనే.. రేవంత్‌పై సుస్మిత ఫైర్

**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (ఆగస్టు 19)**



: పరకాల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో టికెట్ వివాదం ముదిరింది. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే మళ్లీ అవకాశం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.

పరకాల నుంచి వచ్చే ఎన్నికల్లో తానే పోటీ చేస్తానని, కాంగ్రెస్ టికెట్ రాకపోయినా అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగుతానని సుస్మిత స్పష్టం చేశారు. పరకాలలో తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో పరకాలలో ఇల్లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

**రేవంత్‌పై ఘాటు విమర్శలు**

సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై సుస్మిత తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఎదగాలని తొలుత కోరింది కొండా దంపతులేనని, పీసీసీ అధ్యక్షుడైన తర్వాత తమ ఇంటికి వచ్చి కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు.యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. బీసీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కూడా ఆమె ఆరోపించారు. సీఎం పదవి వచ్చాక రేవంత్ వైఖరిలో మార్పు వచ్చిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.తన వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇస్తే ఆయనకు సంబంధించిన పలు విషయాలను బయటపెడతానని సుస్మిత హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో పరకాల టికెట్ వ్యవహారం కాంగ్రెస్‌లో మరింత రాజకీయ వేడిని రాజేసింది. మరోవైపు సుస్మిత వ్యాఖ్యలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందిస్తూ.. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, పార్టీలో కొన్ని విధానాలు, ప్రక్రియలు ఉంటాయని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడు సరైన సమాధానం ఇస్తానని అన్నారు.ఈ పరిణామాలతో పరకాల కాంగ్రెస్‌లో కొండా కుటుంబం--రేవూరి వర్గాల మధ్య రాజకీయ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. వచ్చే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ టికెట్ అంశం ఇప్పుడే హాట్‌టాపిక్‌గా మారడం ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నందిగామ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, ఆగస్టు 19, (తెలంగాణ వాణి)**
: పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలో బుధవారం నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాలలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, ఆగస్టు 19, (తెలంగాణ వాణి):**
నియోజక వర్గంలోని ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని.. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పటాన్ చెరు పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకున్నప్పు డే మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణ యాదవ్, ప్రతినిధులు పవన్, వీరేశం, రాజేశ్వర్, రజనీకాంత్, సుధాకర్, అశోక్, కార్తీక్ గౌడ్, నరసింహ, సునీల్, శంకర్, రవీందర్, సతీష్, సదానందం, అశోక్, మహిపాల్ రెడ్డి, వీరన్న, నరసింహ, పరమేశ్వరరావు, మురళి, నరేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత జౌళి శాఖ ఏడిని కలిసిన రఘునాథపురం బాలాజీ పవర్ లూమ్స్ సంఘం నాయకులు



**రాజపేట ఆగస్టు: 19(తెలంగాణ వాణి విలేకరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం బాలాజీ పవర్ లూమ్స్ సొసైటీ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బూరెల స్వామి ఉపాధ్యక్షులు బోద్దుల వెంకటేశం ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఏడి శ్రీనివాస్ రావు ను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారిని చేనేత శాలువాలతో ఘనంగా సత్కరించి, సందర్భంగా వారికి పవర్లూమ్ కార్మికుల సమస్యల గురించి వినతి పత్రం ఇచ్చారు .మర మగ్గాల కార్మికులకు జియో టాక్ నెంబర్ అందరికీ కల్పించాలని, త్రీప్తు పథకం చేనేత కార్మికులకు 8% డిపాజిట్ చేస్తే వారి ఖాతాకు ప్రభుత్వం 16% శాతం జమ చేయుచున్నది చేనేత కార్మికులు 1200 జమ చేస్తే 2400 ఇస్తుంది, అదే మాదిరిగా పవర్లూమ్స్ వారికి జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీ చేసింది, అదే తరహాలో కుటీర పరిశ్రమ కింద ఉన్న పవర్ లూమ్స్ కార్మికులకు కూడా రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్న కార్మికులందరికీ రుణమాఫీ ప్రకటించాలని బ్యాంకు రుణాలకు సబ్సిడీ కల్పించాలని, కుటీర పరిశ్రమ కింద ఉన్న పవర్ లూమ్స్ వారికి 750 యూనిట్ల విద్యుత్ తమిళనాడు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నారు అదే మాదిరిగా మన తెలంగాణలో కూడా ప్రభుత్వం అమలు చేయాలని, చేనేత పవర్ లూమ్స్ కార్మికులను ఆదుకోవాలని ఉచిత విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా పై సమస్యల పై సానుకూలంగా స్పందించిన ఎడి శ్రీనివాసరావు అమలయ్యే విధంగా పై సమస్యల గురించి చేనేత జోలి శాఖ కమిషనర్ కు చేనేత మంత్రివర్యులకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో తారకరామా పవర్ లూమ్స్ సొసైటీ అధ్యక్షులు ,గాడిపల్లి శ్రవణ్ శ్రీ పద్మ పవర్ లూమ్స్ సొసైటీ అధ్యక్షుడు బింగి సుదర్శన్, రాజాపేట శ్రీనివాస పవర్ లూమ్స్ సొసైటీ అధ్యక్షులు ఆ ఆడెపు రామకృష్ణయ్య, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నం వెంకటరమణ, సంఘంల ప్రజా ప్రతినిధిలు సొసైటీల ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు, కోశాధికారులు డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు.

## గీతంలో ఘనంగా ఫార్మకాలజీ దినోత్సవం

### అతిథిగా పాల్గొని, కీలకోపన్యాసం చేసిన ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణమూర్తి శ్రీనివాసన్



**పటాన్ చెరు, ఆగస్టు 19, (తెలంగాణ వాణి):**
హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (జీఎస్పీ), 'మెరుగైన ఆరోగ్యం కోసం ఔషధ ఆష్కరణను ప్రోత్సహించడం' అనే ఇతివృత్తంతో రెండవ జాతీయ ఫార్మకాలజీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. భారతీయ ఫార్మకాలజీ వ్యవస్థాపకుడైన కల్నల్ ఆర్.ఎన్.చోప్రాను స్మరిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం, ఔషధ ఆవిష్కరణను ముందుకు తీసుకెళ్లడంలో, ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో ఫార్మకాలజీ పోషిస్తున్న కీలక పాత్రను ప్రముఖంగా చాటింది. హైదరాబాదులోని సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణమూర్తి శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ-అబ్ స్ట్రాక్ట్ పుస్తకాన్ని వర్చువల్ గా ప్రారంభించారు. 'ఔషధ ఆవిష్కణలో ప్రీక్లినికల్ ఫార్మకాలజీ: అంతర్దృష్టులు, సవాళ్లు, పురోగతులు, అవకాశాలు' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ, ఔషధ ఆవిష్కణ, ప్రీక్లినికల్ నమూనాలు సమర్థత, భద్రత, ఎక్స్ పోజర్, అభివృద్ధి చెందుతున్న విధానాలు, పరిశోధనను సమర్థవంతమైన మందులుగా మార్చడంలో ఎదురయ్యే సవాళ్లపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. వర్ధమాన ఫార్మసిస్టులు నూతన ఆవిష్కరణలను స్వీకరించాలని, శ్రేష్ఠతను సాధించాలని, ఫార్మాస్యూటికల్ పరిశోధన, ఆరోగ్య సంరక్షణకు అర్థవంతంగా దోహదపడాలని ఆయన పిలుపు నిచ్చారు. ఫార్మకాలజిస్టుల పాత్రను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, మెరుగైన ఆధారాలు, మెరుగైన నిర్ణయాలు, వేగవంతమైన అనువాదం, మెరుగైన ఆరోగ్యాన్ని సాధించడమే అంతిమ లక్ష్యమని ఆయన అన్నారు. 'ఔషధ ఆవిష్కరణ ను మెరుగైన ఆరోగ్యం కోసం ఆధారాలుగా మార్చే వారధి యే ప్రీ క్లినికల్ ఫార్మకాలజీ' అని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలలో భాగంగా, ఫార్మకాలజీ, ఔషధ ఆవిష్కరణకు సంబంధించిన అంశాలపై ఒక ఈ-పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధకులు చురుకుగా పాల్గొని తమ జ్ఞానాన్ని, సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ పోటీ కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన 120కి పైగా ఈ-పోస్టర్లను పరిశీలించి, వాటిలో మూడు అత్యుత్తమైన వాటిగా ఎంపిక చేసి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతు లతో పాటు జ్ఞాపికలు, ఐదు వేలు, మూడు వేలు, రెండు వేల రూపాయల నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమం, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు ప్రముఖ నిపుణులతో సంభాషించడానికి, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటికల్ పరిశోధనలలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలు, సవాళ్ల పై అవగాహన పొందడానికి ఒక ఆసక్తికరమైన వేదికను అందించింది. బీ.ఫార్మసీ చివరి ఏడాది విద్యార్థిని రిధిమ స్వాగత నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సోనియా రాణి స్వాగతోపన్యాసం చేశారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్, కార్యక్రమ చైర్ పర్సన్ ప్రొఫెసర్ జి.శివకుమార్, అతిథిని సత్కరించి, వందన సమర్పణ చేశారు. శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో, మెరుగైన ఆరోగ్య ఫలితాల కోసం సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన ఔషధాలను అభివృద్ధి చేయడంలో ఫార్మకాలజీ ప్రాముఖ్యతను ఈ వేడుక పునరుద్ఘాటించింది.

## 102 పోయిన మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

### రూ.21 లక్షల విలువైన ఫోన్ల రికవరీ.. సీఈఐఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి తిరిగి పొందవచ్చని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రికవరీ చేసిన 102 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.21 లక్షలు ఉంటుందని తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేస్తే ఫోన్‌ను గుర్తించి రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా 2,024 మొబైల్ ఫోన్లను, సుమారు రూ.4.5 కోట్ల విలువైన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు వెల్లడించారు. మొబైల్ పోయిన వెంటనే వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అజ్ఞాత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు వెల్లడించవద్దని ఎస్పీ హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సీఈఐఆర్ బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించి, పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి, ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, వివరాల్లో వ్యత్యాసాలు, అనామలీస్ పరిశీలనను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న వారికి నోటీసులు జారీ చేసి, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేలా సమాచారం అందించాలని తెలిపారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంతో పాటు, అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన శిక్షణ, మార్గదర్శకాలు అందించి, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతకు కీలకమైనందున ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## ఫోటోగ్రాఫర్లు చరిత్రను, జ్ఞాపకాలను భద్రపరిచే కళాకారులు: నీలం మధు

**పటాన్‌చెరు, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇస్నాపూర్‌లో ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోలు చరిత్ర, జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు అందించే శాశ్వత సాక్ష్యాలని ఆయన అన్నారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆలేరులో తెలంగాణ అమరవీరుల స్థూపానికి శంకుస్థాపన



**ఆలేరు, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
ఆలేరు పట్టణంలోని అండర్‌పాస్ చౌరస్తాలో తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటేలా స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అండర్ పాస్ చౌరస్తాకు 'తెలంగాణ అమరవీరుల చౌరస్తా'గా నామకరణం చేయనున్నట్లు ప్రకటించారు. స్థూపం నిర్మాణ పనులను బీర్ల ఫౌండేషన్ నిధులతో చేపట్టి నాణ్యతతో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాలల రోస్టర్ పాయింట్ల సవరణకు సెప్టెంబర్ 7న చలో మెదక్



**మెదక్/నర్సాపూర్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
విద్యా, ఉద్యోగ నియామకాల్లో మాలల రోస్టర్ పాయింట్లను 22 నుంచి 16కు సవరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7న చలో మెదక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాలల జేఏసీ జిల్లా చైర్మన్ జె.ఎల్ల సుధాకర్ తెలిపారు. నర్సాపూర్‌లో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, హక్కుల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 7న మెదక్ కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పీఆర్‌టీయూ టీఎస్ రాజపేట మండల అధ్యక్షుడిగా గౌటే బాలరాజు

**రాజపేట, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**



పీఆర్‌టీయూ టీఎస్ రాజపేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గౌటే బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా సంపతి సుబ్బరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ, బిల్లుల చెల్లింపులు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, 5,500 ఎస్జీటీ, పీఈటీ, హెచ్ఎం పోస్టుల భర్తీ, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధన తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయంపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: జీవన్ రెడ్డి



**జగిత్యాల, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
సామాజిక న్యాయం గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో కులవృత్తులు, రైతులు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. గురుకుల విద్యను విస్తరించిన కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పేరుతో గురుకులాలను కనుమరుగు చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## జాతీయ యోగాలో విజేతలుగా నిలవండి: ఎమ్మెల్యే గంగుల

- బాల్యం నుండే యోగాలో శిక్షణ పొందాలి.
- ఘనంగా జిల్లా స్థాయి యోగా పోటీలు.



**కరీంనగర్:ఆగస్టు 19 (తెలంగాణ వాణి)**
యోగాకు పుట్టినిల్లు అయిన భారత దేశంలో మన కరీంనగర్ జిల్లా నుండి అధిక సంఖ్య లో క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలో విజేతలుగా నిలవాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు.ఈ మేరకు కరీంనగర్ జిల్లా యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయి.ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ మన సంస్కృతికి చిహ్నమైన యోగాలో నేడు ప్రపంచంలో 160 దేశాల్లో ప్రాతినిధ్య వహించడం సంతోషదాయ కమన్నారు.మొక్కై వంగనిది మ్రానై వంగున అన్న చందం గా చిన్న వయసు నుండి యోగాలో శిక్షణ పొందితే విస్తృత ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. తనలాంటి వారికి యోగా చేయాలన్నా ఆసక్తి ఉన్న అది పూర్తిస్థాయిలో నెరవేర దని,అందుకే విద్యార్థులు అందరూ బాల్యం నుండే యోగాలో ప్రవేశం పొందాల న్నారు.యోగాలో భాగస్వా ములు అయితే ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మాన సికంగా దృఢంగా ఉంటార న్నారు.ప్రతి ఇంటిలో యోగ అభ్యసన తప్పనిసరి అని అందుకోసం రానున్న రోజుల్లో ఆర్ట్స్ కళాశాల మైదానంలో యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించా రు.కరీంనగర్లో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల విజయవంత నిర్వహణకు తాను పూర్తిగా సహకరిస్తాన ని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర యోగ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి మాట్లాడుతూ యోగాలో కరీంనగర్ జిల్లాది ప్రత్యేక స్థానమని ఇక్కడి నుండి సిద్ధారెడ్డి ప్రణీత యమునా లు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించార న్నారు.ఈ క్రీడలో రాణించా లన్న ప్రాథమికంగా యోగా శిక్షణ తప్పనిసరి అన్నారు. అన్ని క్రీడలకు మూలమైన యోగాతో మానసిక దృఢ సంకల్పంతో నిర్దేశిత లక్ష్యాలను సాధించగలర న్నారు.కలాం చెప్పినట్లుగా లక్ష్యాలు ఉన్నతంగా ఉండా లని ప్రతి క్రీడాకారుడు స్వర్ణ పతకమే లక్ష్యంగా సాధన చేయాలన్నారు.అమ్మ చేతి వంట అమృతం అని మార్కెట్లో లభించే కల్తీ ఆహారాలకు క్రీడాకారులు దూరంగా నిలవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర యోగ అసోసియేషన్ చైర్మన్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా కరీంనగర్ జిల్లా రాష్ట్రస్థాయి లో ఛాంపియన్గా నిలుస్తుం డడం సంతోషదాయకమ న్నారు.ప్రతిభగల క్రీడాకారు లు ప్రోత్సహించడంలో తమ అసోసియేషన్ ముందుం టుందన్నారు.ప్రత్యేక క్రమం తప్పకుండా అసోసియేషన్ ఆధ్వర్యంలో చాంపియన్షిప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ యోగ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హించనున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా జాతీయ యోగ పోటీలు కరీంనగర్లో నిర్వహించేలా ఎమ్మెల్యే గంగుల చొరవ తీసుకోవాల ని కోరారు.ఈ పోటీల నిర్వహణతో జాతీయ క్రీడా పటంలో కరీంనగర్కు ప్రత్యేక స్థానం లభిస్తుంద న్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు వివిధ కేటగిరిలో పాల్గొన్నా రు. క్రీడాకారులు ప్రదర్శిం చిన యోగ విన్యాసాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ వి శ్రీనివాస్ ఆర్ఎస్ఎస్ ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్,మాజీ కార్పొరేటర్లు చల్లా హరి శంకర్,ఎడ్ల అశోక్,మైఖేల్ శ్రీనివాస్ జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ, కోశాధికారి పి.స్వరూప చారి,ఎం వికాస్ యోగా కోచులు వి.కిష్టయ్య,పి మల్లిక,ఆనంద కిషోర్,వీణ వాణి,రాజమౌళి,శైలజ, ప్రవళిక,కె రాజశేఖర్,బి అశోక్,మనోహర్ తదితరు లు పాల్గొన్నారు

## సాంకేతిక విద్యను నిర్వీర్యం చేసే ఆలోచన మానుకోవాలి

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 19 (తెలంగాణ వాణి)**
సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే షాహిద్, వరక అజిత్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి నిర్వహించి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ప్రభావితం చేసే జీవో నం.97ను రద్దు చేయడంతో పాటు శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యను బలోపేతం చేసి





విద్యార్థులకు మెరుగైన విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల డిప్లొమా విద్యార్థులు ఈసెట్ ద్వారా ఉన్నత విద్యలో ప్రవేశించే అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1957 నుంచి ఎంతో మంది సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను పరిరక్షించేందుకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, జిల్లా సమితి సభ్యులు ఉమామహేశ్వర్, రాజు, కమల్, షబ్బీర్, నాయకులు కోమలి, మానస, మన్విత, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**చుంచుపల్లి, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ముఖ్యంగా భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. పెండింగ్ దరఖాస్తులకు గల కారణాలను తహసీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకుని, అవసరమైన విచారణ, రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలను సకాలంలో పూర్తి చేసి దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.
జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తదితర దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. ఏ దరఖాస్తును అనవసరంగా పెండింగ్లో ఉంచరాదని, పారదర్శకంగా, వేగవంతంగా రెవెన్యూ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## కార్పొరేషన్ కార్యాలయం కనిపించేలా చర్యలు తీసుకోవాలి

**కొత్తగూడెం, ఆగస్టు 19 (తెలంగాణ వాణి):**
కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రజలు సులభంగా గుర్తించేలా ప్రహరీ గోడను ఎత్తుగా నిర్మించి, పరిశుభ్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చిత్రాలతో సుందరంగా తీర్చిదిద్దాలని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునగడప వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రజావాణిలో మేయర్, కమిషనర్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు కార్పొరేషన్ కార్యాలయాన్ని గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యాలయానికి స్పష్టమైన గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు .అదే విధంగా నగరంలో కోతులు, కుక్కలు, పందుల బెడద తీవ్రంగా ఉందని, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పందుల సంచారాన్ని నియంత్రించాలని అధికారులను కోరారు.

## రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి సాగాలి: ఎమ్మెల్యే గంగుల కమలాకర్

- పారిశుద్ధ్యం, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి..
- ప్రతి డివిజన్కు సమానంగా నిధులు కేటాయించాలని ఆదేశం



**కరీంనగర్, ఆగస్టు 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కరీంనగర్ నగర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ కపిల్ దేశాయ్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగర అభివృద్ధిపై గంగుల కమలాకర్ సమీక్ష నిర్వహించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, విద్యుత్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. స్మార్ట్ సిటీ, యూడీఐఎఫ్ తదితర నిధులను ఏ ఒక్క డివిజన్కే పరిమితం చేయకుండా అన్ని డివిజన్లకు సమానంగా కేటాయించి సమగ్ర అభివృద్ధి చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఖ




## ఎన్టీఆర్-త్రివిక్రమ్ సినిమాపై హాట్ టాపిక్.. ట్రెండింగ్‌లో ఆ రెండు టైటిల్స్!

టాలీవుడ్ మోస్ట్ అంటెసిపేటెడ్ కాంబినేషన్లలో ఒకటైన యంగ్ టైగర్ ఎన్టీఆర్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రాబోయే సినిమాకు సంబంధించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికర వార్త తెగ చక్కర్లు కొడుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎన్టీఆర్ ఆర్ట్స్' తాజాగా రెండు సూపర్ టైటిల్స్‌ను అధికారికంగా రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. తారక్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా బయటకు వచ్చిన ఈ టైటిల్స్ మరింత హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ 'దేవసేనాపతి' మరియు 'గాడ్ ఆఫ్ వార్' అనే రెండు టైటిల్స్‌ను ట్రేడ్ వర్గాల్లో రిజిస్టర్ చేయించినట్లు సమాచారం. ఈ రెండు టైటిల్స్ వింటుంటేనే ఇదొక పౌరాణిక టచ్ ఉన్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే ఊహాగానాలు ఫ్యాన్స్ మధ్య జోరుగా సాగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి త్వరలోనే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎన్టీఆర్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌కు ఏ టైటిల్ ఫిక్స్ చేస్తారనేది ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

## తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కిన 'పల్లెబురుసు'పై బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రశంసలు!




తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన 'పల్లెబురుసు' చిత్రం విడుదలై ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో ఇటీవల కాలంలో వస్తున్న భారీ యాక్షన్ సినిమాలకు పూర్తి భిన్నంగా, అత్యంత సహజమైన కుటుంబ కథాంశంతో రూపొందిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా ఈ సినిమా చూసిన ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రశంసల వర్షం కురిపించారు. లెటర్‌బాక్స్ వేదికగా ఈ చిత్రానికి ఏడుకి ఐదు స్టార్ల రేటింగ్ ఇస్తూ ఆయన ఒక అద్భుతమైన రివ్యూను పంచుకున్నారు. ప్రస్తుత చిత్ర పరిశ్రమలో రొటీన్ యాక్షన్ సినిమాల జోరు ఎక్కువగా ఉందని, వాటి మధ్య ఈ 'పల్లెబురుసు' ఒక సరికొత్త రిఫ్రెషింగ్ మార్పులా కనిపిస్తోందని అనురాగ్ కశ్యప్ కొనియాడారు. సినిమా చాలా సింపుల్‌గా, ఆకట్టుకునేలా సాగుతూ ప్రేక్షకులను నిత్యం నవ్విస్తుందని ఆయన తెలిపారు. 'కేరాఫ్ కంచరపాలెం', 'రావు బహదూర్' చిత్రాల దర్శకుడు వెంకటేష్ మహా ఎంట్రీని గుర్తుచేస్తూ, నూతన దర్శకుడు ఉదయ్ చౌహాన్ భవిష్యత్తులో మరిన్ని గొప్ప సినిమాలు తీయగలడంటూ ఆయనను ప్రత్యేకంగా ప్రశంసించారు. కేవలం లెటర్‌బాక్స్‌లోనే కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఈ సినిమాపై తన అభిప్రాయాలను పంచుకుంటూ, ఇదొక అరుదైన డ్రామెడీ (డ్రామా ం కామెడీ) చిత్రమని అభివర్ణించారు. సాధారణ కుటుంబంలో తండ్రీకొడుకుల మధ్య జరిగే ఒక చిన్న వివాదం చుట్టూ ఈ కథ నడుస్తుంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కొడుకు తనకు టూత్ బ్రష్ కొనివ్వలేదంటూ ఒక వృద్ధ తండ్రి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడం కథాంశం. ఈ చిన్న ఫిర్యాదు కాస్తా క్రమంగా పెద్ద లీగల్ మరియు భావోద్వేగ యుద్ధంగా మారి, వారి మధ్య సంవత్సరాలుగా దాగి ఉన్న ఏకాంతం, మనస్పర్థలను ఎలా బయటపెట్టిందనేదే ఈ చిత్ర కథాసారాంశం. ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తండ్రీకొడుకులుగా ప్రధాన పాత్రల్లో నటించి అద్భుతమైన అభినయాన్ని ప్రదర్శించారు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి అన్నపూర్ణ స్టూడియోస్ మరియు ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మాణం వహించగా, నాగార్జున ఈ ప్రాజెక్ట్‌ను సమర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. శ్మశానవాటికలో ఏడుస్తున్న ఒక వృద్ధుడిని చూసి తనకు వచ్చిన ఆలోచన నుంచే ఈ కథను రూపొందించినట్లు దర్శకుడు ఉదయ్ చౌహాన్ గతంలో వెల్లడించారు.

## రవితేజ 'ఇరుముడి' సెన్సార్ పూర్తి.. రన్‌టైం ఎంతంటే!

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివి తో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించను న్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 22వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది




Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com